

కథ

యల్లాప్రగడ సువర్చలాదేవి

# చిదానందం-ప్రశాంత జీవనం

“చూడు ఆనంద్..! మనం క్రమశిక్షణగా ఉంటేనే మన క్రింద పని చేసేవారు కూడా ఉంటారు. మీరు అవసరమైనప్పుడు రాత్రి వేళ ఎక్కువసేపే ఉంటారు. కాదనడం లేదు. కానీ మన పై అధికారులెవ రైనా వచ్చినప్పుడు మీ టీంమెంబర్లు సీట్లలో లేకపోతే కవర్ చేయడానికి కూడా ఇబ్బందిగా ఉంటుంది” తిట్టి నట్టే మాట్లాడుతూ వాతలు పెడుతున్నాడు బాస్.

చిదానందానికి తన అసహాయతకి చిరాకేసింది. పేరుకేమో పెద్ద బహుళజాతి సంస్థలు, పెద్ద పెద్ద జీతాలు, అనుకూలమైన పని వేళలు. కానీ మళ్లీ ఈ సాధింపులకేమీ తక్కువ లేదు. రాత్రిళ్ళు అమెరికాలో ఉండే అధికారులతో పనులని చెప్పి అర్ధరాత్రి దాకా ఇంటికెళ్ళడానికి ఉండదు. పొద్దున్నే రాకపోతే ఇక్కడి అధికారుల ఆక్షేపణలు. అలాగని వద్దామంటే రాత్రి ఇంటికెళ్ళి ఏదైనా తిని కాస్త ఇంట్లో వాళ్ళతో నాలుగు మాటలు మాట్లాడో, కాసేపు ఏ టీవీ ముందు కూర్చున్నా లేక ఏ పుస్తకంలో నాలుగు పేజీలు తిరగే సినా, క్యాలెండర్లో డేట్ మారకుండా పడుకోవడం ఉండదు. పొద్దున్న లేచి తయారయి ఎంత తొందరగా బయలుదేరినా ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించుకొని ఆఫీస్‌లోకి అడుగుపెట్టేసరికి ప్రతిరోజూ ఆలస్యమవు తూనే ఉంది. తాను ఆలస్యంగానే ఇంటికి వెళుతున్నాను కనుక తను ఆఫీసుకెళ్ళేది ఆలస్యంగా కాదని అతని వాదన. కానీ వినే వారే లేరు. గత పదేళ్ళుగా ఇలాంటి వాతావరణంలోనే మగ్గుతున్నా ఇంకా ఈ జీవితానికి అలవాటు పడలేకపోతున్నాడు మన చిదానందం.

ఆరోజు ఆదివారం కదా కాస్త ప్రశాంతంగా పదు కొందామనుకొన్న చిదానందానికి కాలింగ్ బెల్ అదే పనిగా మోగడంతో లేవక తప్పలేదు. నీళ్ళు అయిపోవ స్తున్నాయని, త్వరగా లేచి పట్టుకొమ్మని వాచ్‌మెన్ హెచ్చరిక. ఇక లేవక తప్పదని అర్థమయ్యి తిట్టు కొంటూ లేచిన కాసేపటికి అపార్ట్‌మెంట్‌లో నీళ్ళ సమస్య మీద ఏదో మీటింగని వాచ్‌మెన్ చెప్పడంతో మరోసారి చిర్రెత్తుకొచ్చింది.

ఈ అపార్ట్‌మెంట్‌లో పని లేని పెద్దలందరూ ఇలా ఆదివారం వస్తే మీటింగులని టైం వేస్టు చేస్తుంటారని, ఇందులో తేల్చేదేముండదని ఓ రెండు గంటలు అనవస రమైనవన్నీ మాట్లాడి, చివరికి మెయింటెనెన్స్ మొత్తాన్ని కాస్తా పెంచి చేతులు దులిపేసుకొంటారని అతని ఉద్దేశ్యం. అందుకే అతనికీ అపార్ట్‌మెంట్లు అంటే ఇష్టం లేదు.

సిటీలో ఇండిపెండెంట్ ఇల్లు అంటే ఏ శివార్లకో వెళ్ళాలి! అక్కడికి మేము రాలేమని ఇంట్లో అంతా అల్టి మేటం ఇచ్చేసరికి తప్పక సర్దుకుపోతున్నాడు. నిన్న లెటర్ బాక్స్ చూడలేదని వెళ్ళి చూసిన అతనికి అనవస రమైన పాంప్లెట్లతోపాటు ట్రాఫిక్ పోలీసు వారి నుండీ వచ్చిన ఓ ఛలాన్ చూసేసరికి గతుక్కుమన్నాడు. ఎప్ప టిదా అని చూస్తే ఎప్పుడో మూడు నెలలక్రితం తేదీ ఉంది దానిమీద. రాంగ్ పార్కింగ్ చేసినందుకు ఫైన్ అని ఉంది. బాగా ఆలోచించిన మీదట గుర్తొచ్చింది. ఆరోజు తన ఇంటి దగ్గర్లోని ఓ గ్రౌండ్‌లో తన స్నేహితు లతో క్రికెట్ ఆడాడు తను. శెలవురోజుల్లో అలా అప్పు డప్పుడు ఆడుతుంటాడు. గ్రౌండ్ బయట కారు పార్క్ చేశాడు తను. సాధారణంగా అక్కడ రోజూ ఉదయం పూట చాలా కార్లు, టూ వీలర్లు ఉంటాయి. అక్కడ పార్కింగ్ చెయ్యద్దని గాని, నో పార్కింగ్ బోర్డుగాని ఉన్నట్లు తనకి తెలిసి ఏమీ లేవు. గ్రౌండ్‌కి వచ్చేవారు అక్కడ తప్ప ఇంకెక్కడా పార్క్ చేయడానికి లేదు. నూటికి 90 శాతం ఎవ్వరు ఏమీ అభ్యంతరం చెప్పరు. అతని బ్యాడ్‌లక్ ఆ రోజు ఆ గ్రౌండ్ దగ్గర ఏదో పొలిటి కల్ మీటింగ్ ఉండటంతో అనుకోకుండా పోలీసులు వచ్చి ఆ దగ్గర్లో పార్క్ చేసిన అన్ని వాహనాలపై ఛలాన్ లను వేసేసినట్టున్నారు. ఇక ఇప్పుడు ఎవరితో వాదిం చినా ఉపయోగం లేదు. వెళ్ళి ఫైన్ కట్టేసి రావాలని అస హంగానే వెళ్ళాడు. ఈమధ్య అన్నీ తనకి చిరాకు తెప్పించే రూల్సే ఎక్కువగా పెడుతున్నారని అతని బాధ. కార్ల అద్దాలు బాగా డార్క్ చేయకూడదట, ఒకవేళ చేసి ఉంటే మార్పించాలట. ఈ అనవసరపు ఖర్చు ఎవరు భరిస్తారు? ఎందుకు పెడుతుంటారో ఇలాంటి రూల్సు. తనలాంటి సామాన్య మానవుడి పాలిట ఇవి గుదిబండ లని అతని స్ట్రాంగ్ ఫీలింగ్.

నిద్ర లేచినప్పటినుండీ అతనికి ఇలాంటి సమస్యలే అన్నీ.

సినిమాల్లో, కథల్లో చూపించే ఆకలి కష్టాలు, మానవ సంబంధాల మధ్య అపశృతులు ఇవే కాదు తన లాంటి సిటీ జీవుల కష్టాలు మాత్రం తక్కువ కష్టాలా అంటాడతను. రోజు రోజుకీ అతనికీ జనారణ్యం అంటే విముఖత పెరగసాగింది. ఏ పల్లెటూరైనా వెళ్ళి కొన్నా ళ్ళైనా ప్రశాంతంగా ఉందామంటే ఏ పల్లెటూర్లోనూ తనకి తెలిసిన వాళ్ళెవ్వరూ లేరు. చుట్టాలందరు సిటీ ల్లోకి వలసెళ్ళిపోయారు. పోనీ కొన్నాళ్ళు శెలవుపెట్టి ఏ రిసార్టులలాంటి వాటికైనా వెళ్దామంటే అక్కడా కమర్షి యల్ అయిపోయింది. మనశ్శాంతిగా ఉండే చోటే లేదా! పేరులో తప్ప జీవితంలో ఆనందమే లేదని వాపో యేవాడు పాపం చిదానందం.

అతని అదృష్టమా అన్నట్లు ఆరోజు అతని మిత్రుడు కామేశం నుండి ఫోన్ వచ్చింది. అతనూ తనలాంటి సిటీ కష్టాల బాధితుడే. అందుకే ఎప్పుడైనా వీలు చిక్కిన ప్పుడల్లా ఇద్దరూ ఈ కష్టాల నుండి తప్పించుకోవడానికి మార్గాలు వెతుకుతుంటారు. ఆ రోజూ అదే చర్చ. “అవున్రా...మొన్న మా పక్కింటి వాళ్ళు వెళ్ళారట. హైద రాబాద్‌కి రెండు, మూడు వందల కిలోమీటర్ల దూరం లోని ఓ మారుమూల అటవీ ప్రాంతమట. అక్కడ ఓ పేరుమోసిన ప్రకృతి వైద్యులు ఆశ్రమం నడుపుతున్నా రట. చాలా చిన్న మొత్తానికే వారమంతా ఉండొచ్చుట. ప్రకృతి జీవన విధానాన్ని చెప్తారట. చాలా ప్రశాంతంగా ఉంటుందిట. నువ్వెప్పుడు వెళ్దామంటే చెప్పు, నేన ప్పుడు రెడీ” ఉత్సాహంగా చెప్పాడు కామేశం. ఇదేదో బానే ఉందనిపించింది చిదానందానికి.

ఓ సుముహూర్తాన్ని చూసి భార్యామణిని పుట్టిం టికి పంపి తనూ, కామేశం కలిసి ప్రకృతి ఆశ్రమానికి బయలుదేరారు. కొంతదూరం రైలు, ఆ తర్వాత బస్సు ప్రయాణం చేసిన తర్వాత గుర్రపుబండి ఎక్కాల్సి వచ్చింది మిత్రులిద్దరికి. మొదట బానే అనిపించినా గతుకుల రోడ్డు, గుర్రపు బండి కుదుపుల వలన ఒళ్ళు హూనం అయినట్లు అనిపించినా ఏదో అడ్వంచరస్‌గా ఉందని సర్దిచెప్పుకున్నారు తేలుకుట్టిన దొంగల్లా. పచ్చని ప్రకృతి, వాటిమధ్య ఓ పద్ధతిగా కట్టిన ఆశ్రమం. కాటేజీలు అవీ చెక్క, పెంకులు, గడ్డిలాంటి వాటినే ఎక్కువగా ఉపయోగించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎలాంటి రణగొణ ధ్వనులు, కాలుష్యం లేకుండా ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించినా మిత్రులిద్దరికీ తమకు కేటాయించిన గదిలోకి వెళ్ళగానే చిన్న షాక్ తగిలినట్లైంది. కారణం అందులో ఎలాంటి మంచాలు,



సోఫాలు లాంటివేమీ లేవు. చూస్తే అక్కడ బాయ్‌లాంటి వాళ్ళెవరూ లేకపోవడంతో వీళ్ళే రిసెప్షన్ దగ్గరికెళ్ళి ఇదేంటని అడిగారు.

ప్రకృతి జీవన విధానంలో ఇలాగే ఉంటుందని, ఏదైనా తినాలన్నా, తాగాలన్నా నేలమీదనే చేయడం మంచిదని ఇలా ఏర్పాటు చేశామని చెప్పడంతో చేసేది లేక తమ కాటేజీకి తిరుగుముఖం పట్టారు. స్నానం చేద్దామంటే గీజర్లు లేవు. పోనీ వేన్నీళ్ళ కోసం ప్రయత్నిద్దామంటే ఆరోగ్యానికి చన్నీళ్ళే మంచివని అక్కడ వేన్నీళ్ళు దొరకవని తెలిసింది. ఏదో కానిచ్చిన మిత్రులు ఆ రోజుకి ప్రయాణ బడలికతో నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయమే నాలుగు గంటలకు మంచి నిద్రలో ఉండగా ఎవరో తలుపుబాదుతుంటే మెలకువ వచ్చి కలలో వెళ్ళినట్లుగా వెళ్లి తలుపు తీసి చూస్తే ఆశ్రమానికి చెందిన వ్యక్తి ఒకరు. ఆశ్రమ కార్యక్రమాలకి వేళయ్యిందని, లేవాలని చెప్పాడు. ఎంత కళ్ళు తెరవాలనిపించినా తెరవలేకపోతున్నాడు చిదానందం. కామేశం మాత్రం వెళ్ళకపోతే బాగోదేమో అని, పైగా తాము ఏమైనా మంచి కార్యక్రమాలు మిస్ అయిపోతామేమోనని మిత్రుడిని బలవంతంగా తీసుకెళ్ళాడు.

ముందుగా వాటర్ థెరపీ. అందరూ ఒక్కో లీటర్ నీటిని తాగి అటు ఇటు నడవమని చెప్పారు. అంత పొద్దున్నే అదీ పాచిపళ్ళని తోమకుండా నీటిని తాగడం గగనమైపోయింది మిత్రులిద్దరికీ. ఆ తర్వాత ఆరుబయటకే అందరు విసర్జన కార్యక్రమాల నిమిత్తం వెళ్ళారు. రోజూ తొమ్మిది గంటలకి లేచి తయారయ్యే తనకి ఈ పద్ధతులేవీ అంతుబట్టకుండా ఉన్నాయి. ఆ తరువాత వ్యాయామాలని, ఆసనాలని అక్కడి ఆశ్రమవాసులంతా వాళ్ళ వాళ్ళ కార్యక్రమాలలో లీనమవడంతో మిత్రులిద్దరు తాము కూడా కొన్ని ఆసనాలు చేయడానికి తెగ ప్రయత్నించి విఫలమయ్యారు. అనవసరంగా ఈ వచ్చీ రాని వ్యాయామాలు చేసి ఏ కాలో, చెయ్యో పట్టుకుపోతే అసలుకే మోసం వస్తుందని కామేశమేమో ఎక్కువగా

'శవాసనం' వేయడానికే ప్రాధాన్యత ఇస్తే, మరీ ఎవరైనా చూస్తే బాగుండదని ఏవో చేతులు, కాళ్ళు కాస్త కదిలించి అయ్యిందనిపించాడు చిదానందం.

ఉదయపు మొదటి ఆహారంగా కూరగాయలతో చేసిన ఓ రసాన్ని ఇచ్చారు అందరికీ. దాదాపు వాంతి వచ్చినంతపనైంది మిత్రులిద్దరికి. ఇక అల్పాహారంగా మొలకెత్తిన విత్తనాలు ఇచ్చారు. అవీ లేదంటే కొన్ని కాయగూరల ముక్కలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎలాగోలా వెతికి ఏవో కొన్ని పళ్ళను సంపాదించి ఉపాహారం అయ్యిందనిపించారు మిత్రులు. ఇక ఆ తర్వాత వారికి కాస్త ఖాళీ దొరికింది. కాసేపు పేపర్ చూద్దామని ప్రయత్నించారు కానీ వారికక్కడ చదవడానికి పేపరు గానీ, చూడటానికి టీవీగానీ, వినడానికి రేడియోగానీ ఏవీ లేవు. సామాన్య జనారణ్యానికి దూరంగా ఉండాలనే ఇక్కడ అలాంటివాటికి చోటివ్వలేదని చెప్పారు అక్కడి నిర్వాహకులు. కాలక్షేపం కోసం అక్కడో గ్రంథాలయం ఉంది అని తెలిసి అక్కడికెళ్ళిన మిత్రులిద్దరికీ అక్కడా నిరాశే ఎదురైంది. అక్కడంతా ప్రకృతి వైద్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మికతకి చెందిన పుస్తకాలే ఉండడంతో, ఒకపక్క కరకరమని ఆకలేస్తున్నా మధ్యాహ్నం భోజనాల టైం వరకూ ఏమీ పెట్టరు గనుక ఎలాగోలా ఏదో కాలక్షేపం చేసి చివరికి భోజనశాలకి చేరుకున్నారు మిత్రులిద్దరు.

అసలే తను నాన్ వెజిటేరియన్ కనుక ఏది పెట్టినా తినేయాలన్నంత కసి మీద ఉన్నాడు కామేశం. ఎర్రగా పెద్ద పెద్ద మెతుకులతో ఉన్న పదార్థాన్ని చూసి అదేంటని అడిగాడు కాస్త బెదిరిన చిదానందం. అది కూడా అన్నమేనని ముడి బియ్యంతో చేయడం వలన ఆ రంగులో ఉంటుందని పక్కనున్న ఓ ఆసామి చెప్పాడు. ఆ ముడి బియ్యంతో చేసిన అన్నాన్ని తినలేకపోయారు మిత్రులు. అలాగే కూరలు సైతం ఉప్పు, నూనె లేకుండా ప్రత్యేకంగా వండినవి. అక్కడున్నవాళ్ళలో చాలామంది వాటిని ఆబగా, ఆహా, ఓహో అని తింటున్నా, బర్గర్లకు, పిజ్జాలకు, బిర్యానీలకు అలవాటుపడిన ఈ ప్రాణులకు మాత్రం అవి రుచించలేదు.

భోజనానంతరం ఏదో చర్చా కార్యక్రమాలంటే అటెళ్ళారు. అవీ ఆరోగ్యం, ఆధ్యాత్మికత, ఆసనాలు ఇలాంటి విషయాలపైనే. "బహుశా ఇవి మనలాంటి చిన్నవయస్సు వారికి కావేమోరా" అన్నాడు చిదానందం అనుమానంగా. ఏమంటే మిత్రుడేమంటాడో అని "చూద్దాంలేరా..రోజూ ఇలానే ఉండదులే" అని లేని ధైర్యాన్ని తెచ్చుకొన్నాడు కామేశం. ప్రకృతి వైద్యులు జీవన విధానాన్ని వివరిస్తున్నారు. 'జంతు సంబంధిత అన్ని పదార్థాలలో కొవ్వు వుంటుంది. మీకు అనవసరమైన కొవ్వు అక్కర్లేదనుకుంటే కేవలం వృక్ష సంబంధిత పదార్థాలనే తినండి. మీరు తెలియకుండా అనవసరంగా కాఫీ, టీ, కూల్ డ్రింక్స్ ఇలాంటివి తాగుతూ ఉంటారు. ప్రకృతిలో ఏ ఇతర జీవి అన్నాన్ని వండుకొని తినడం, ఇలా కృత్రిమంగా తయారుచేసిన ఆహార పదార్థాలను తినడం, తాగడం చేయవు. అందుకే వాటికి మనిషికి వస్తున్న అనారోగ్య సమస్యలు రావడం లేదు' చెప్పుకొంటూ పోతున్నారు. చిదానందానికి అంతా అయోమయంగా వుంది.

అంటే తను ఇన్నాళ్ళు తింటోంది ఉపయోగం లేనివా? ఇలాగైతే ఇక తనేం తినాలి. ఇంకా కాసేపు ఉంటే తన జీవితంపైన తనకే విరక్తికలిగేలా ఉందనిపించి ఓసారి చుట్టుపక్కల చూశాడు. అందరూ ఉపన్యాసంలో లీనమయి ఉన్నారు. కొందరు వక్తలు చెప్తున్న విషయాలను నోట్ కూడా చేసుకుంటున్నారు. ఆ కార్యక్రమం అయ్యాక ఓసారి ఇంటికి ఫోన్ చేద్దామని చూస్తే సెల్‌లో సిగ్నల్ లేదు. అక్కడ దగ్గర్లో ల్యాండ్ లైన్ ఫోన్ కూడా దొరకలేదు. ఒకవేళ ఎవరికైనా సుస్తీ చేసి అత్యవసర పరిస్థితి వస్తే అని అక్కడో ఆసామిని అడిగితే, అక్కడుండి ప్రకృతి జీవన విధానాన్ని పాటించే వారికి అలాంటి అనారోగ్య పరిస్థితులు అంత త్వరగా రావుట. ఒకవేళ అలాంటి అనుమానమే వస్తే ముందే అక్కడ నుండి పంపించేస్తారట. సిటీలోని తన జీవన విధానానికి ఇక్కడి జీవన విధానానికి పోల్చి చూస్తూ ఆలోచనలో పడ్డాడు చిదానందం. ఆ రోజు సాయంత్రం విసుగెత్తి చుట్టుపక్కల ఏమైనా విహార స్థలాలేమైనా ఉన్నాయేమోనని వెతికిన మిత్రులిద్దరికి నిరాశే ఎదురైంది. అక్కడంతా ఆ ఆశ్రమమే అని, చుట్టుపక్కలేమున్నా ప్రశాంతతకి భంగం అని ఏమీ లేని మారుమూల ఈ ఆశ్రమాన్ని నిర్మించారని వాళ్ళకి అర్థమయ్యింది.

సాయంత్రం పెందరాళే భోజనం అంటే - వేడన్నం, కందిపొడుం, ఆవునెయి, ఆవకాయ అని వెళ్ళిన మిత్రులిద్దరికి పుల్కాలు, వాటిలోకి ఉప్పు, నూనె లేకుండా ప్రత్యేకంగా తయారుచేసిన తోటకూర పొడి కూర, ఆనపకాయ కూర లాంటివి నవ్వుతూ దర్శనమిచ్చాయి. వాటితో కుస్తీపడి చివరికి మింగలేక, కక్కలేక ఏదో అయిందనిపించారు.

తరువాత ఏవో సాంస్కృతిక కార్యక్రమాలంటూ అందరూ ఓ సభాస్థలి లాంటి ప్రదేశానికి చేరారు. కాస్సేపు ఏవో ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, చర్చలు, ప్రశ్నలు, సమాధానాలు, చివరికి భజన కార్యక్రమాలు జరిగాయి. మిగతా వాళ్ళందరూ ఆ రోజు అద్భుతంగా గడిచిందని పొగుడుకుంటూ వెళ్తుంటే మిత్రులిద్దరూ మాత్రం తెల్లమొహం వేసుకొని కాటేజికి తిరుగుముఖం పట్టారు.




మరో మూడు రోజులు గడిచాయి. కార్యక్రమాలలో మార్పులేమీ లేవు కానీ వీళ్ళ అసహనం మాత్రం పెరిగిపోతూనే ఉంది. క్రికెట్ మ్యాచ్ విశేషాలేంటో తెలియడం లేదని, తాజా రాజకీయ విశ్లేషణలు ఏంటో అని, కొత్త సినిమాలు ఎలా ఆడుతున్నాయో అని, వాటి టాక్ ఏంటో అని, షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్ ఏమయిపోయాయో అని ఇలా అసహనంగా ఉన్నారు.

తాము ఇంకా నాలుగు రోజులు ఉండటానికి డబ్బు కట్టినా ఇక ఏమాత్రం ఉండలేనని తిరుగుముఖం పట్టాడు చిదానందం. ఏమైనా అంటే తంతాడేమోనని పెద్దగా వాదించకుండా మిత్రుడిని అనుసరించాడు కామేశం.

శనివారం సాయంత్రం ఏసీ రూములో హాయిగా ఈజీ ఛైయిర్‌లో వెనక్కి వాలి సాస్‌లో ముంచుకుంటూ సమోసాలు హాయిగా లాగిస్తున్నాడు చిదానందం, టీవీలో వస్తోన్న బ్లాక్ బస్టర్ మూవీనీ, క్రికెట్ మ్యాచ్‌ని మార్చి మార్చి చూస్తూ. అతనికిప్పుడు ఎంతో హాయిగా ఉంది. సినిమా మధ్యలో ఓ పాత్ర అంటోంది మరో పాత్రతో 'ఇవతలి ఒడ్డునుండీ చూస్తే అవతలి ఒడ్డు ఎప్పుడూ బాగున్నట్టే కనిపిస్తుంది. అవతలి ఒడ్డుకి వెళితేగాని నిజమెంతో తెలియదు'. తనకే చెప్పినట్లనిపించింది చిదానందానికి.

సమస్య అనేది ఎక్కడో లేదు. తనలో ఉన్నట్లనిపించింది. అదీ తన ఆలోచనా విధానంలోనే అని. ఎక్కడుండే సమస్యలు అక్కడుంటాయి. కొన్ని సుఖాలు కావాలంటే కొన్ని కష్టాలను భరించక తప్పదు అనిపించి చిన్నగా నిట్టూర్చాడు.

ఇంతలో సెల్ మోగింది. తీస్తే కామేశం. "ఏంట్రా..ప్రయాణ బడలిక తీరినట్లేనా? ఆఫీసులో అంతా ఓకేనే కదా! ఈసారి బాగా తెలిసిన మా ఫ్రెండ్‌ని కనుక్కొన్నా, కేరళలో ఓ మంచి రిసార్ట్ ఉందిట. మనకి తక్కువలో ఇప్పిస్తానని చెప్పాడు. నువ్వెప్పుడంటే అప్పుడు పెడదాం ప్రోగ్రాం" అన్నాడు ఉత్సాహంగా.

"మొన్న వెళ్ళొచ్చింది చాల్లేదంట్రా...ఇంకెప్పుడూ ఇలాంటి చచ్చు పుచ్చు సలహాలివ్వకు" అని ఫోన్ కట్ చేసి, పుట్టింటికెళ్ళిన భార్యామణిని తీసుకురావడానికి ఎప్పుడెళ్లాలా అని ఆలోచిస్తూ ఇక తనకు ఇలాంటి ఆశ్రమాలకి వెళ్ళాల్సిన అవసరం రాదులే అని ఈజీ ఛైయిర్‌లో రిలాక్సయ్యాడు చిదానందం.